నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | MEDAK



# ధరల మంట




- తడిసి మోపెడవుతున్న కుటుంబ వ్యయం
- లీటరు నూనె ప్యాకెట్‌పై ఏకంగా రూ.15 నుంచి రూ.20 పెరుగుదల
- భారీగా పెరిగిన బియ్యం ధరలు
- నాసిరకం సరుకులు అంటగడుతున్న వ్యాపారులు
- మార్కెట్‌లో ఏది కొందామన్నా కొనలేని పరిస్థితి
- ఇష్టారీతిగా సరుకుల ధరలు పెరగడంతో ప్రజల ఉక్కిరిబిక్కిరి
- ప్రభుత్వం నియంత్రించాలంటున్న ప్రజలు

సిద్దిపేట, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'ప్రైవేట్ ఉద్యోగికి నెల జీతం రూ. 30 వేల వస్తుంది. తన భార్య నడిపే చిన్న కుటీర పరిశ్రమ ద్వారా మరో రూ.10 వేలు వస్తున్నాయి. వీరిద్దరి కుటుంబ ఆదాయం నెలకు రూ.40 వేలు. పిల్లల చదువులు, ఇంట్లో నిత్యావసర సరుకులు, ఇంటి కిరాయిలు ఇతర ఖర్చులు మూడు సంవత్సరాల కిందట నెలకు రూ.25 వేలు ఉండేవి. ఇప్పుడు పెరిగిన ఇంటి కిరాయిలు, నిత్యావసర సరుకులు ఇతర ఖర్చులు కలుపుకొంటే ఆ ఇంటి ఖర్చు దాదాపు రూ.40 వేల వరకు ఉంటున్నది. గతం కంటే ఇప్పుడు ఏకంగా సరాసరి రూ.15 వేలు పెరిగింది. ఇది ప్రైవేట్ ఉద్యోగి కుటుంబం లెక్క తీసుకుంటేనే. అదే నిరుపేద కుటుంబం, దినసరి కూలీ చేసుకునే కుటుంబాల పరిస్థితులు ఏంటో అర్థం చేసుకోవచ్చు.' నిత్యావసర సరుకులు పెరుగుదలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ఇష్టారీతిగా సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా ఆ కుటుంబాలు పెరిగిన ధరలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కుటుంబ బడ్జెట్ కూడా తడిసి మోపెడవుతున్నది.

**తలకిందులవుతున్న కుటుంబ బడ్జెట్**

కొంతకాలంగా పెరిగిన ధరలు, ఇతర వ్యయాలతో కుటుంబ బడ్జెట్ తలకిందులుగా మారుతున్నది. ఇంటి కిరాయిలు, పాలు, చక్కెర, పప్పులు, బియ్యం, కూరగాయలు, ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల నిత్యావసర ధరలు భగ్గుమంటున్నాయి. వీటికితోడు ప్రతి ఇంటిలో అనారోగ్యం ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. ఇటీవల పెరిగిన ధరలతో సామాన్యుల నోట మాట రావడం లేదు. ఏ వస్తువు కొందామన్నా ధరల పెరుగుదల కనిపిస్తున్నది. ఏకంగా లీటరు నూనె ప్యాకెట్‌పై రూ.15 నుంచి రూ. 20 పెరిగింది. క్వింటాల్‌కు ఏకంగా వివిధ రకాల బియ్యాన్ని బట్టి రూ. 300 నుంచి రూ.600 వరకు పెరిగాయి. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు ఇదే అదునుగా మరింత రేట్లు పెంచారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రోటీన్లు అధికంగా లభించే పప్పులు ధరలు కూడా పెరిగాయి. కూరగాయల ధరలు పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు. ప్రతి ఇంట్లో వంట నూనెల వాడకం తప్పనిసరి. నూనె లేనిది ఏ వంట కూడా చేయలేం. ప్రస్తుతం మార్కెట్‌లో నూనె ధరలు అమాంతం పెరిగాయని వినియోగదారులు చెబుతున్నారు. ఎంత లేదన్నా ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రతి రోజూ సరాసరిగా 350 టన్నుల వివిధ రకాల నూనెలు మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వస్తున్న వేళ వంట




నూనెలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 20 శాతం మేర పెంచింది. దీంతో నూనెల ధరలు భగ్గుమంటున్నాయి. రానురానూ ఉమ్మడి జిల్లాల్లో పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటల విస్తీర్ణం తగ్గుతుంది. బయట ప్రాంతాల నుంచి నూనెలు ఎగుమతి అవుతున్నాయి. చాలావరకు నూనెలు నాసిరకం ఉంటున్నాయి. వివిధ రకాల బ్రాండ్ల పేరుతో మార్కెట్‌లోకి వచ్చిన వాటిలో నాసిరకం ఎక్కువగా ఉంటుంది. దీనిని అరికట్టాల్సిన సంబంధిత శాఖ అధికారులు చూ సీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో నాసిరకం నూనెలు రాజ్యమేలుతున్నాయి. నాసిరకం నూనెల వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.



**పెరిగిన బియ్యం ధరలు**

బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. సన్నబియ్యం క్వింటాలు బ్యాగుకు ఏకంగా రూ.300పైగా పెరిగింది. ఆయా రకాల బట్టి ధరలు ఉన్నాయి. నాణ్యమైన బియ్యం ధరల పేరుతో ఇందులో కూడా మోసాలు చేస్తున్నారు. స్టీమ్ రైస్ నింపి నాణ్యమైన బియ్యం అని చెప్పి వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. స్టీమ్ బియ్యాన్ని వివిధ రకాల సంచుల్లో నింపి వివిధ రకాల పేర్లతో మోసాలు చేస్తున్నారు. నాణ్యమైన బియ్యం అని తీసుకుపోయిన వినియోగదారుడు వంట వండే సరికి ఆ బియ్యం గడ్డలు కట్టడం ముద్ద అవడం జరుగుతున్నది. ఇది చూసి అవాక్కవుతున్న వినియోగదారుడు వ్యాపారి దగ్గరికెళ్లి ఇదేంటని అడిగితే మాకేం తెలుసు అని దబాయిస్తున్నారు. వ్యాపారస్తులపై నియంత్రణ లేకపోవడంతో మార్కెట్‌లోకి నాణ్యమైన బియ్యం పేరిట స్టీమ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఆయా రేషన్ షాపుల నుంచి తీసుకువచ్చిన బియ్యాన్ని పాలిష్ చేసి నాణ్యమైన బియ్యంగా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఈ దందా సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జోరుగా సాగుతున్నది. ఇంత జరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. వారికి నెలనెలా మామూళ్లు ముట్టడంతో వారు గుమ్మనంగా ఉంటున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.





సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ సురేశ్ షెట్కార్

# సమగ్రాభివృద్ధికి కృషి

- దిశ కమిటీ చైర్మన్, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్
- సంగారెడ్డిలో జిల్లా అభివృద్ధి కమిటీ(దిశ) సమావేశం

సంగారెడ్డి, సెప్టెంబర్ 19: సంగారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమన్వయంతో అమలు చేయాలని అధికారులకు దిశ కమిటీ చైర్మన్, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ సూచించారు. గురువారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి కమిటీ(దిశ) సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం పేరును మార్చి దిశగా నామకరణం చేశామని చైర్మన్ తెలిపారు. నూతనంగా నియమితులైన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే నంబర్‌వన్ జిల్లాగా సంగారెడ్డిని నిలపాలని, అందుకు అధికారుల సహకారం అవసరమన్నారు. లింగపల్లి నుంచి జహీరాబాద్ వరకు పారిశ్రామిక రంగం విస్తరిస్తున్నదని, ఇప్పటికే జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ ప్రారంభించామని, నిమ్జ్‌లో 5వేల ఎకరాల భూసేకరణ పూర్తి అయిందన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు.

**అధికారుల తప్పిదంతోనే రుణమాఫీకి అన్నదాతలు దూరం : రఘునందన్‌రావు**

సంగారెడ్డి జిల్లాలో సీడెడ్ సొసైటీల్లో రైతులు తీసుకున్న రుణాలకు మాఫీ ఎందుకు రాలేదని, ఇందుకు పాపం ఎవరిదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం ఆరు నెలలుగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించినా, అధికారులు మాత్రం అర్హుల జాబితా సిద్ధం చేయడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. జిల్లాలోని సీడెడ్ సొసైటీలు రుద్రారం, నందికంది, తేర్పోల్, కొండాపూర్, మల్కాపూర్‌లలో దాదాపు రూ.20 కోట్ల మాఫీ నిలిచిపోయిందని, వెంటనే రుణమాఫీ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేని క్వారీలపై చట్టపరమైన చర్యలు తీసుకొని ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వసూలు చేయాలన్నారు. ఖాజీపల్లిలో నివాసాల దగ్గర బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడానికి కారణలేమైన ఉన్నాయా అని ప్రశ్నించారు. 54 ఎకరాల్లో పీపీఆర్‌కే మినరల్స్ యాజమాన్యం అక్రమ తవ్వకాలు జరుపుతున్నదని, వాటిపై సర్వే నిర్వహించి గ్రామాలకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు.

**సమగ్ర నివేదికలతో రావాలి : కలెక్టర్ క్రాంతి**




సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, సభ్యులు లేవనెత్తిన సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. నేను లేను, కొత్తగా వచ్చాను అనే సమాధానాలు రావొద్దని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, శిక్షణ కలెక్టర్ మనోజ్, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు మల్లన్నసాగర్‌ను సందర్శించనున్న హరీశ్‌రావు



తొగుట, సెప్టెంబర్ 19: కరువు కాటకాలతో నెర్రెలు బారిన నేలలు..వర్షం కోసం మొగులుకు ముఖంపెట్టి ఎదురు చూడాల్సిన పరిస్థితి... సాగు నీటి కోసం బోర్లు తవ్వి బోర్లాపడ్డ రైతుల వ్యథలు.. ఇగ మా జీవితాలు ఇంతే అనుకున్న సందర్భంలో.. తెలంగాణ ప్రధాత కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. కేసీఆర్ అడుగులో అడుగై అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి, ప్రస్తుత సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా పురుడు పోసుకున్న మల్లన్నసాగర్ ప్రాజెక్టు నేడు గోదావరి జలాలతో నిండుకుండలా కళకళలాడుతున్నది. శుక్రవారం మల్లన్నసాగర్‌ను మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితోపాటు రైతులతో కలిసి మధ్యాహ్నం ఒంటి గంటలకు సందర్శించనున్నారు.

# నిమ్జ్‌తో నిరుద్యోగులకు ఉపాధి

- భూములు ఇచ్చే రైతులకు వెంటనే పరిహారం
- సంగారెడ్డి రెవెన్యూ విభాగం జాయింట్ కలెక్టర్ మాధురి

న్యాల్‌కల్, సెప్టెంబర్ 19: నిమ్జ్ ప్రాజెక్టుకు భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చే రైతులకు పరిహారాన్ని వెంటనే అందజేస్తామని సంగారెడ్డి జిల్లా రెవెన్యూ విభాగం జాయింట్ కలెక్టర్ మాధురి అన్నారు. గురువారం న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిమ్జ్ ప్రాజెక్టులో భాగంగా పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, నిమ్జ్ కోసం గ్రామంలో 1650 ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు. ఇప్పటికే 450 ఎకరాల భూమిని నిమ్జ్ కోసం సేకరించామని చెప్పారు. మండలంలోని రైతులు నిమ్జ్‌కు భూములు ఇవ్వాలని ఆసక్తి ఉంటే సంబంధిత అధికారులకు అంగీకారపత్రాలను అందజేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వారికి వెంటనే పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూములు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లిన రైతులు కోర్టు నుంచి కేసులను విరమించుకోవాల్సి ఉంటుందన్నారు. అంగీకారపత్రాలు అందజేసే రైతులకు ఎకరానికి రూ.15 లక్షల పరిహారాన్ని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గడ్డం జనార్దన్, అధికారులు సురేఖ, గోకుల్, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా రేజింతల్ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మాధురి

# సద్గురు సదనంలో ముగిసిన వేద సభ

**జిక్కి కృష్ణావధానికి వేదరత్న బిరుదు ప్రదానం**



జిక్కి కృష్ణావధానికి వేదరత్న బిరుదు ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

చేర్యాల, సెప్టెంబర్ 19 : తెలంగాణ వైదిక విద్యాసాధికారికత, స్వాభిమానముల సాధనే లక్ష్యంగా సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని శృంగేరి నగర్‌లోని సద్గురు సదనం (ఆదిశంకర మందిరం)లో మూడు రోజులుగా తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్ధక సభా చతుర్వేద సదస్సు విజయవంతంగా కొనసాగింది. ఈ సదస్సులో నిత్యం ప్రత్యేక పూజలు, విద్వత్ పరీక్ష సభలు జరిగాయి. దక్షిణామ్నాయ శారదా శృంగేరి జగద్గురువుల అనుగ్రహ ఆశీస్సులతో నిర్వహిస్తున్న సభలో ముగింపు రోజు గురువారం గురుప్రార్థన పూజ, సహస్ర మోదక లక్ష్మీగణపతి హోమం, గాయత్రి, రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ జగద్గురువుల అనుగ్రహం, ప్రభుత్వ సహకారంతో ప్రతి పాఠశాలకూ సిలబస్‌తోపాటు ఆర్థికసాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. దర్శనం మాసపత్రిక ఎడిటర్ వెంకన్నశర్మ మాట్లాడుతూ ప్రతినిధులు, మంత్రులందరూ ఈ సభలో ఉండి వేద పండితులకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ ఏడాది జిక్కి కృష్ణావధానిని సన్మానించి వేదరత్న బిరుదును ప్రదానం చేశారు. దివంగత నాచారం చంద్రకాంత శర్మను స్మరిస్తూ సన్మాన పత్రాన్ని ఆయన శిష్యుడైన భాస్కరశర్మకు అందించారు. అనంతరం అధ్యాపకులను, శాస్త్ర పండితులను, ఘనాపాటీలను, వేద పండితులను, ఉత్తీర్ణులైన విద్యార్థులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి రాచర్ల రవిచంద్రశర్మ, కార్యదర్శి చేబియం రాఘవశర్మ, సదుర్గ సదనం నిర్వాహకులు లలితామతి శర్మ, రామచంద్రమూర్తి శర్మ, మేధావి శర్మ, నాగరాజు శర్మ, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, వైదిక ధర్మ పరిరక్షలు పాల్గొన్నారు.



దుబ్బాక ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

# ఎర్రరాయి గనుల తవ్వకాలపై మైనింగ్ అధికారుల దాడులు

- యంత్రాలు, ట్రాక్టర్లతో పారిపోయిన అక్రమార్కులు
- రెండు ట్రాక్టర్లు, లారీ స్వాధీనం
- నిమ్జ్ భూముల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్న అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

న్యాల్‌కల్, సెప్టెంబర్ 19: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని గణేశ్‌పూర్ శివారులోని నిమ్జ్ ప్రాజెక్టు భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న ఎర్రరాయి గనులపై గురువారం జిల్లా మైనింగ్ శాఖాధికారులు దాడులు చేశారు. ఈనెల 12న 'నమస్తే తెలంగాణ' దినపత్రిలో ప్రచురితమైన 'నిమ్జ్ భూముల్లో అక్రమ తవ్వకాలు' అనే శీర్షికకు అధికారులు స్పందించారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ నాగరాణి నిమ్జ్ భూముల్లో అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనింగ్ శాఖ ఏడీ రఘు పర్యవేక్షణలో మైనింగ్ శాఖ రియల్టీ ఇన్‌స్పెక్టర్ సాయిరాం సిబ్బందితో కలిసి గణేశ్‌పూర్ శివారులో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న ఎర్రరాయి గనులపై దాడులు చేశారు. దాడుల విషయం తెలుసుకున్న అక్రమార్కులు రాయి కోత యంత్రాలు, జేసీబీ, హిటాచీతోపాటు ఎర్రరాయి లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు, లారీలను తీసుకుని పరుగులు పెట్టారు. అధికారులకు యంత్రాలు, లారీలు, ట్రాక్టర్లు కనబడకుండా గనుల సమీపంలోని పంట పొలాలు, పొదల్లో దాచిపెట్టారు. దాడుల్లో రెండు ట్రాక్టర్లు, ఒక లారీని అధికారులు పట్టుకున్నారు. అధికారులు గనుల్లో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఎర్రరాయి గనుల్లో అక్రమంగా తవ్విన రాయిని తీసుకెళ్తున్న లారీ, ట్రాక్టర్‌ను హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిమ్జ్ భూముల్లో ఎలాంటి తవ్వకాలు చేపట్టారదన్నారు. ఇక నుంచి తరుచుగా ఎర్రరాయి గనులపై దాడులను చేపడుతామన్నారు. మండలంలోని హద్నూర్, న్యామతాబాద్, మల్కన్‌పాడ్, రేజింతల్ గ్రామ శివారులోని భూముల్లో అనుమతి లేకుండా ఎర్రరాయిని తవ్వితే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ శాఖ రియల్టీ ఇన్‌స్పెక్టర్ సాయిరాం హెచ్చరించారు. ఈ దాడుల్లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంరావు, సర్వేయర్ లాల్‌సింగ్, పోలీసులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా న్యాల్ కల్ మండలంలో గణేశ్‌పూర్ గ్రామ శివారులోని అనుమతి లేకుండా వెళ్తున్న లారీని పట్టుకున్న మైనింగ్ శాఖాధికారులు

# గంగమ్మ ఒడికి వినాయకుడు

**అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో నిమజ్జనాలు**

అమీన్‌పూర్ సెప్టెంబర్ 19: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పలు వినాయక మండపాల వద్ద మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహ గౌడ్ గణేశుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఏటా ఆయన ఆధ్వర్యంలో చేపట్టే గణేశ్ నిమజ్జనాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో నిర్వహించిన నృత్యాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నారు. ఈ పూజల్లో కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.





అమీన్‌పూర్ లో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, శోభాయాత్ర

# పాతిపెట్టిన బాలుడి మృత దేహానికి పోస్టుమార్టం

- మృతదేహం నుంచి శాంపిల్స్ సేకరణ
- రెవెన్యూ, పోలీసుల సమక్షంలో పోస్టుమార్టం



కొన్యాలలో పాతిపెట్టిన బాలుడి మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది, అధికారులు

హత్నూర, సెప్టెంబర్ 19: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాలలో పాతిపెట్టిన బాలుడి మృతదేహానికి 12 రోజుల తర్వాత గురువారం రెవెన్యూ, పోలీసు అధికారులు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ విలేకరులతో మాట్లాడుతూ కొన్యాల గ్రామానికి చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల చిన్న కుమారుడు దశ్విక్(45రోజులు) అనారోగ్యానికి గురికావడంతో ఈనెల 5న చికిత్స కోసం సంగారెడ్డిలోని శిశురక్ష ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడ ఈనెల 8వ తేదీ వరకు చికిత్స అందించిన వైద్యులు బాలుడి పరిస్థితి విషమించడంతో నిలోఫర్ దవాఖానకు తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో కుటుంబీకులు అదేరోజు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తన కుమారుడి మృతికి కారణమైన శిశురక్ష దవాఖానపై చర్యలు తీసుకోవాలని బాలుడి తండ్రి ప్రభులింగం 13న జిల్లా వైద్యాధికారి, సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబీకుల ద్వారా ఫిర్యాదు అందుకున్న డీఎంహెచ్‌వో శిశురక్ష దవాఖానను తనిఖీ చేసి ల్యాబ్ సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. దవాఖానపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి సంగారెడ్డి వైద్యకళాశాల ప్రొఫెసర్లు డా.వేణుగోపాల్, దీపక్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతదేహం నుంచి సేకరించిన నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సంగారెడ్డి ఎస్సై నర్సింహులు, డిప్యూటీ తహసీల్దార్ దావూద్, ఆర్ఐ శ్రీనివాస్‌తోపాటు గ్రామస్తులు ఉన్నారు.